

# పెళ్ళిచూపులు

ఆ వాళ మాఘశుద్ధపంచమి. వివాహాల హడావిడివల్ల బస్సులు నిండిపోతూ న్నయ్. బస్సులో ఖాళీలేక ఆ పక్కనో నలుగురూ ఈపక్కనో నలుగురూ నిలు చున్నారు. అప్పటికే కండక్టరు ఇరవై ముగ్గురను ఎక్కించుకోవలసిన బస్సులో నలువదిమందిని కుక్కాడు.

క్రొత్తగా మడతవిప్పి కట్టుకున్న చలువ ధోవతి నలిగిపోతూంది. పెళ్ళిచూపులకు వెళతూంటే అనవసరంగా బట్టలు మలినమై పోతూంటే వరకుమారుని మనస్సు ఎంత ఖేదం అనుభవిస్తుందో యోచించండి. ఈ కండక్టరు ఇంతమందిని ఎందుకు ఎక్కించాలి? ఎక్కేవాళ్ళకైనా జ్ఞానం ఉండవద్దూ? ఆ! నేనుకూడా అలా ఎక్కినవాడినేగా! అయితేమటుకు? నాది అవసరమైనపని. విధి లేక తప్పని సరిగా యెక్కాను. ఏం? ఇత రులు కూడా అలానే యెక్కారని ఎందు కనుకోగూడదూ? వారికిమాత్రం అవసరమైన పనులులేవూ?

"చాలా అవస్థగా ఉందండీ!" అన్నాను; ప్రక్కన కూర్చున్నస్వీయపురోహితుడు సూరిశర్మతో. బొడుంపట్టు మైకంలో నా మాటలు ఆయన చెవిదూరలేదు.

వెనుకసీటులోనుంచి చుట్టపొగ కమ్ము కుంది. వాంతి వచ్చేటట్టుంది. అయినా మన దేశస్థులు మర్యాదా మంచీ తెలియనిమూర్ఖులు! లేకపోతే బస్సులో చుట్టకాల్చటమేమిటి? ఆమాత్రం ప్రపంచజ్ఞానం ఉండొద్దూ? ఆ ఆసామినిమందలిస్తే?....ఆ!....మనకెందుకు రభస.........అయినా నేనుమాత్రం అనేక సమయాల్లో మిత్రబృందాల్లో సిగరెట్లుకాల్చ లేదూ? అప్పుడు నాచుట్టూ ఉన్నవారిలో ఎంత మంది పొగపడని వాళ్ళున్నారో కొంచెమైనా గమనించేవాడినీ? కాని సిగరెట్ పొగ అంత దుర్భరంగా ఉండదు. ఎందుకీ కల్పిత సం తృప్తి? "తనకంపుతనకింపు!" అంతే!

నలిగి మాసిపోయిన బట్టలతో ఎలా చూడను పెళ్ళికూతుర్ని? ఆమె నన్నుచూచి అసహ్యంచుకోదుగదా! ఈ నిస్సహాయ దరిద్ర స్థితికి ఎవరిని దూషించను?

ఏమైనాసరే నేనీబరువుమోయనని మొండి కేస్తున్నట్టుగా గర్రుమంటూ ఆగింది బస్సు. బొడుంకాయ నడుంలో చుట్టిలేచాడు సూరి శర్మ. "బ్రతుకుజీవుడా" అనుకుంటూ బైట పడ్డాం.

ఆ పల్లెటూరి బడిపిల్లలు ఎగబడి చూస్తు న్నారు మావంక. వాళ్ళ చిలిపి కన్నులు శర్మ గారి విభూతి రేఖలపైన కేంద్రీకరింపబడి నాయి. వినోదపు నవ్వు వెన్నెలలు వాళ్ళ గుసగుసల్లో కలిసిపోయినాయి.

వాడిపోయిన ముఖం కొంచెం వంచు కుని నలిగిపోయిన చొక్కావంక విచారంగా చూచుకుంటూ నడుస్తున్నాను. జేబుదగ్గిర పెద్ద సిరామరక కనుపించింది. ఈ పాడు కలం పైమూత కలాన్ని జారవిడిచింది. ఏం చెయ్యను? ఎవరిని నిందించను?

వధువును ఎదురుగుండా చిరిచాపమీద కూర్చోబెట్టారు. ఎర్రతోలే! అందంగానే ఉంటుంది. అయితే? ఇక్కడికి నేనెందుకు వచ్చాను? పెళ్ళిచూపులకు! చూచి ఏం చెయ్యాలి? నచ్చితే వివాహం....నచ్చడ మంటే ప్రేమించాలన్నమాట సినిమాలోలా. అంతకు పూర్వం ఎన్నడూ నే నెరుగని ఈ పిల్లను....ఎంత అందంకలిగియుంటే మాత్రం?.... ఒక్కమారుగా బలవంతాన ప్రథమవీక్షణంలోనేప్రేమించాలంటే యెలా సాధ్యం?

"Love in the first sight" అనే మాట అబద్ధమేనా? అసలు "ప్రేమ" అంటే యేమిటి? ఆ వింత వస్తువును బజార్లో కొనుక్కోటానికి వీలులేదుగదా! అయితే మరెల్లా వస్తుంది?

"నీ పేరేమిటమ్మా?" అని ప్రశ్నించాడు శర్మగారు వధువును.

"హేమ" అన్నది జంకుతూ.

శ్రీ నండూరి ఈశ్వరం.

"పిల్ల! యెంతవరకూ చదువుకున్నది?" అని ప్రశ్నించాడు పెళ్ళికూతురు తండ్రిని.

"ఆరవక్లాసువరకూ చదివింది. భారత భాగవతాలు అనర్గళంగా చదువుతుంది" అని నాలుగు పద్యాలూ రెండు పాటలూ చదివించాడు తండ్రి.

ఆ యెదురుగాఉన్న కిటికీ ఊచల్లోంచీ తలుపు సందుల్లోంచీ ఇరుగుపొరుగు ముత్తైదువలూ పూర్వసువాసినులూ అప్పుడే ఏ ఆఫ్రికా ఖండంనుంచో పల్లెటూరి సర్కసు కంపెనీవాళ్ళు తెచ్చామని చెప్పుకునే వింత మృగాన్ని చూచినట్లు గుచ్చి గుచ్చి చూస్తున్నారు నన్ను.

"కట్నం కానుకల విషయం సెలవీయండి." అన్నాడు శర్మగారు.

"వేయిన్నూటపదార్లు కట్నం, ఆడపడుచుల లాంఛనాలక్రింద నూట పదార్లు ఇస్తాను. ఎక్కువ భరించేతాహతులేదు."

"సరి." అంటూ లేచాడుశర్మగారు.

త్వరగాతెమల్చినందుకు శర్మగారిని లోలోననే అభినందించుకుంటూలేచి రెండడుగులు ముందువేసాను. శర్మగారు వెనుక కన్యాదాతతో ఏదో ముచ్చటిస్తున్నారు.

"మామూలుపాతిక....భారంనాది" అనే మాటలు అస్పష్టంగా వినిపించినాయ్. రోడ్డు చేరుకున్నాం. అప్పుడప్పుడే వేసవి యెండ గాడ్పులు ప్రారంభిస్తున్నాయ్. ఎంతసేపు కూర్చున్నా బస్సురాదు. కాఫీనీళ్ళకోసం ప్రాణం పరితపించి పోతూంది. ఎవర్ని అడగను? ఒకగంటకు బస్సువచ్చింది. ఆపి ఎక్కాం.

"శెలవుపుచ్చుకుంటా" అన్నాడు కన్యాదాత దీనంగా.

"సరే! జ్ఞప్తియుంచుకోండి. రెండు మూడురోజుల్లో కబురుపంపుతాం" అన్నాడు శర్మగారు.

"చిత్తం" అన్నాడాయన చిరాకుతో తల గోక్కుంటూ, కారు కదిలింది. ఒక్క నిట్టూర్పువిడిచి "ఇలాటిప్రయాణం పగవాడికైనావద్దురాభగవంతుడా!" అన్నాను ఆపుకోలేక.

"మరేమిటనుకున్నావ్? పెళ్ళిచూపులు!" అన్నాడు శర్మగారు.

ఇంటికిచేరినతరువాత అమ్మా నాన్నా సంబంధం విషయమై ఆదుర్దాగా ప్రశ్నించటం మొదపెట్టారు. అపిల్ల యెలాఉంటుందని ఆజ్ఞాపూర్వకంగా అడిగారు. ఏంసమాధానం చెప్పను?

"పిల్ల అప్సరస. చాలా అందంగా ఉంటుంది. సంగీతం సాహిత్య చెప్పించారు." అన్నాడు సూరిశర్మగారు గట్టిగా.

"నిజమేనా?" అని అదోవిధంగా నావంక చూచాడు నాన్న.

"నిజమే!" అన్నాను. కంఠంవణికింది.

"అయతే నీకు పిల్ల నచ్చిందన్నమాట" అన్నాడు నాన్న.

ఎలా ప్రత్యుత్తర మిన్వను? అర్థంలేని ఈ పేలవ పదాలు నాలోని భావాలను క్షేమ కాంక్షలు ఆతురులు నగు నా తల్లిదండ్రులకు ఎలా తెలియజేస్తాయి?

"నాకు నచ్చలేదు." అన్నాను.

అంతా నిర్ఘాంతపొయ్యారు. పిల్ల అప్సరసలా అందంగా ఉంటుందని ఒప్పుకొని "నాకు నచ్చలేదు." అంటే అర్థం? తెల్లబోయి చూస్తున్నారు నాన్నా అమ్మా.

"ఎందువల్ల నచ్చలా?" అని అడిగింది అమ్మ.

ఎల్లా చెప్పేది? నాలో ఉరలి కెరలి పొరలి ఘూర్ణిల్లే భావాలను ఎలా అర్థం చేయించను? భాషనూ సారస్వతాన్నీ స్వీయ దౌర్బల్యాన్నీ నిందించుకున్నాను.

"ఏమో! నాకు తెలియదు." అంటూ లేచిపోయాను.

అర్ధరాత్రి, సన్నజాజి తీవ సందుల్లోంచి రోహిణీ చంద్రుడు కొంచెంగా కనుపిస్తున్నాడు. రాత్రి రాణిమత్తు వాసనలు జల్లుతోంది. నిద్ర పట్టదు ఎందువల్లననేదే ప్రశ్న.

ఆ వధూ ... హారిణాతరలవీక్షణాలు స్మృతి పథాంతరాల్లో ఒక వింత స్మృతి సంచలనాన్ని కలుగజేస్తున్నయ్! మూసిన కనురెప్పల్లో ఆమె మనోహర రూపం లాస్యం చేస్తోంది. ఎందువల్ల కలగాలి నాకీ భ్రమ? ఇది భ్రమా? ప్రేమా? ఎవరు సమాధానం చెబుతారు? ఈ ఆలోచనలు కట్టిపెట్టాలి. అబ్బ! నిద్రపడితే యెంత బావుండును?

ఆకన్య........ అరే! ఈ పాడు మనస్సు ఊరుకోదే! ఆమెకూ నాకూ ఏం సంబంధం ఏమీలేదే! ఆమెమ నేను ప్రేమిస్తున్నానా? అవును. ప్రేమించాను. ప్రేమిస్తాను.

అమ్మా నాన్నా గాఢనిద్రలో ఉన్నారు. నా అంగీకారాన్ని వారికి తెలియజెయ్యాలనే ఆతురతఅధికమైంది. ఎలా? చెపితే నవ్వరూ? పరిహాసం చేస్తారని నామనో భావంబహిర్గతంచెయ్యటం మానుకుంటానా?

అవును....ఆ మొదటిచూపులు........ మోహవాహినుల్లో....ప్రేమ చంద్రికల్లో ఆమె........ఆసుధాస్వాదులజ్జా మధుర మూర్తి....నా హృదయానికీ నా జీవితానికీ రాజ్ఞి. భవిష్యజ్జీవితం ఎలాగడుస్తుందో! ఒక్కనిట్టూర్పువిడిచాను.

నిద్రాదేవి నన్ను పెనవైచింది.